

టన్ను చీనీ రూ.38 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.38 వేలు పలికాయి.



కిలో టమాట రూ.20

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.14 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
40.9°/23.8°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో పడమటి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

జ్యోతిరావ్ పూలే చిరస్మరణీయులు



జ్యోతిరావ్ పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన జ్యోతిరావ్ పూలే చిరస్మరణీయులని కలెక్టర్ వి.వినోద్ కుమార్ అన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జ్యోతిబా పూలే 198వ జయంతి నిర్వహించారు. బీసీ సంక్షేమాధికారి కుష్బూ కొఠారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘస్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి కూడా నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడారు. అంటరానితనం, కులవివక్ష నిర్మూలన, మహిళాభ్యున్నతి, విద్యాభివృద్ధికి జ్యోతిరావ్ పూలే ఎనలేని కృషి చేశారన్నారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కేజీబీవీ, ఇతర పాఠశాల విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని బహుమతులు గెలిచి జిల్లాకు కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ జేడీ మధుసూదన్‌రావు, డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, డీపీఓ ప్రభాకర్, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి రామసుబ్బారెడ్డి, డీఐపీఆర్‌ఓ గురుస్వామిశెట్టి, కలెక్టరేట్ ఏఓ అంజన్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

ఎన్నికల పరిశీలకులు జిల్లాకు విచ్చేయనున్నారని, ఈ క్రమంలో ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిశీలకుల రాక నేపథ్యంలో స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని కలెక్టర్ గురువారం సందర్శించారు. పరిసరాలు పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతిథిగృహంలో అవసరమైన ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గానికి ఒక నోడల్ అధికారిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరిశీలకులకు అవసరమైన నివేదికలను సకాలంలో అందించాలని చెప్పారు. పరిశీలకుల కోసం ఏర్పాటు చేసిన అధికారుల బృందాలు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో నగర పాలక కమిషనర్ మేఘస్వరూప్, ఆర్‌డీఓ జి.వెంకటేష్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఓబుళరెడ్డి, నోడల్, లైజన్, ఆర్‌అండ్‌బీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులు

చిలమత్తూరు: మండల కేంద్రంలోని బైరేకుంట వద్ద ఉన్న కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు జాతీయస్థాయి సీనియర్స్ విభాగంలో జంప్ రోప్ స్కిప్పింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. పాఠశాల ఎస్‌ఓ సునీత కుమారి మాట్లాడుతూ... మార్చి 31 నుంచి ఏప్రిల్ 2 వరకూ నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో పాఠశాల విద్యార్థినులు చందుప్రియబాయి, ఎస్.రిస్సీ, టి.గిరిజ బంగారు పతకాలు సాధించారన్నారు. ఇందులో చందుప్రియబాయి అంతర్జాతీయ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. త్వరలో జపాన్ రాజధాని టోక్యోలో జరిగే పోటీల్లో ఆమె పాల్గొంటారన్నారు.



దువా చేస్తున్న చిన్నారి

● భక్తిశ్రద్ధలతో రంజాన్

జిల్లావ్యాప్తంగా గురువారం రంజాన్ వేడుకలు భక్తిశ్రద్ధల నడుమ సాగాయి. మసీదులు, దర్గాల్లో ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పకున్నారు. ఖబరస్తాన్‌లలో పెద్దల ఆత్మ శాంతి కోసం ప్రార్థనలు జరిపారు. రంజాన్‌ను పురస్కరించుకుని మతపెద్దలు పర్వదిన విశిష్టత తెలియజేశారు. దానధర్మాలు, ఆధ్యాత్మిక చింతన కొనసాగించాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

- అనంతపురం కల్చరల్/సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం





అనంతపురం ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, (ఇన్‌సెట్) రంజాన్ శుభాకాంక్షలు చెప్పకుంటున్న చిన్నారులు




ప్రసంగిస్తున్న ముస్లిం మతపెద్ద

బాబ్బాబు.. చూసి మాట్లాడు

బాబు మాటలు..
'దేశం'లో గుబులు

- టిప్పర్ డ్రైవర్‌కు టికెట్ ఇచ్చారన్న వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా దుమారం
- కామెడీగా మారిన కరెంటు ఉత్పత్తి వ్యాఖ్యలు
- నాణ్యమైన మద్యం అందిస్తానని చెబుతుండటంపై మహిళల ఆగ్రహం
- తాజాగా వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తాననడంతో గందరగోళం
- ప్రజల్లో చులకన చేస్తున్నారంటూ టీడీపీ నాయకుల అసంతృప్తి
- టికెట్లు దక్కించుకున్న అభ్యర్థుల్లో ఆందోళన



సాక్షి ప్రతినిధి, అనంతపురం: చంద్రబాబు ఎప్పుడు ఏ మాట మాట్లాడతారో ఎవరికీ అర్థం కాదు. సెల్ఫ్ గోల్ ఎప్పుడు చేసుకుంటారో తెలియదు. ఆయన సంగతేమో కానీ, చంద్రబాబు తీరుతో ఆ పార్టీ అభ్యర్థులు, కేడర్ మాత్రం తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. ఎక్కడ చూసినా బాబు వ్యాఖ్యల్ని సామాజిక మాధ్యమాల్లో వింటూ ఓటర్లు అసంతృప్తితో పాటు అసహనం వ్యక్తం చేస్తుండడంతో టీడీపీ టికెట్లు దక్కించుకున్న వారు తలలు పట్టుకుంటున్నారు. అసలే పరిస్థితి కష్టంగా ఉంది, ఎన్నికల్లో ఎలా గట్టెక్కాలో అనే ఆందోళనలో ఉన్న తాము.. చంద్రబాబు వ్యాఖ్యలతో అభాసుపాలు కావాల్సి వస్తోందంటూ తమ సన్నిహితులతో ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది.

కొంపముంచిన టిప్పర్ డ్రైవర్ వ్యాఖ్యలు

ఇటీవల బుక్కరాయసముద్రం పర్యటనకు వచ్చిన చంద్రబాబు శింగనమల వైఎస్సార్ సీపీ అభ్యర్థి వీరాంజనేయులును ఉద్దేశించి టిప్పర్ డ్రైవర్‌కు టికెట్ ఇచ్చారని, వేలిముద్ర వేసే వ్యక్తి అంటూ హేళన చేశారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపాయి. డ్రైవర్లందరూ భగ్గుమన్నారు. ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని కించపరుస్తారా అంటూ ఆ సామాజిక వర్గం వారు కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వాస్తవానికి వీరాంజనేయులు ఎంఏ (ఎకనామిక్స్)తో పాటు బీఈడీ చదివారు. ఉన్నత విద్యావంతుడు. అవన్నీ తెలుసుకోకుండా, కనీస అవగాహన లేకుండా వేలిముద్ర వేసేవాడంటూ బాబు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఆ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఓటమికి బాటలు వేస్తున్నట్టు చెప్పుకుంటున్నారు.

కామెడీగా మారిన కరెంటు ఉత్పత్తి

అదే రోజు రాప్తాడుకు వెళ్లిన చంద్రబాబు..రైతులు పొలంలోనే కరెంటు ఉత్పత్తి చేసి, వాడుకోగా మిగిలింది ప్రభుత్వానికి ఇచ్చేలా చేస్తానని అన్నారు. అసలు పొలంలో కరెంటు ఉత్పత్తి ఏమిటి, మిగిలింది ప్రభుత్వానికి ఇవ్వడం ఏమిటి అంటూ బాబు వ్యాఖ్యలు పెద్ద కామెడీగా మారాయి. సామాజిక మాధ్యమాల్లో చంద్రబాబు మాటలు వింటూ పగలబడి నవ్వుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో దీనిపై తీవ్ర చర్చ జరుగుతోంది. కావాలనే మాట్లాడారా..లేక వృద్ధాప్యం కారణంగా జరిగిందా అని ఓటర్లు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

వలంటీర్లపై నాలుక మడత..

గతంలో వలంటీర్లను గోనె సంచులు మోయడానికా అని చంద్రబాబు అన్నారు. చివరకు వారి ద్వారా పెన్షన్ పంపిణీ జరగకుండా చేశారు. దీంతో పింఛన్‌దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చంద్రబాబును తిట్టిపోశారు. ఇప్పుడేమో వలంటీర్లకు నెలకు రూ.10 వేలు ఇస్తామనడంతో బాబును జనం ఈసడించుకుంటున్నారు. నాణ్యమైన మద్యం అందిస్తా, జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తా అంటూ అలవిగాని హామీలు కురిపించడాన్ని కూడా తప్పుపడుతున్నారు. 14 ఏళ్లు సీఎంగా ఉండి ప్రాజెక్టులు పూర్తి చేయలేని ఆయన ఇప్పుడేం చేస్తారని చర్చించుకుంటున్నారు. అయితే, చంద్రబాబుకేమో గానీ ఆయన వ్యాఖ్యలు తమకు ప్రతిబంధకంగా మారుతున్నాయని ఆ పార్టీ అభ్యర్థులు వాపోతున్నారు. తన మాటలతో తమ కొంప ముంచుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ అధినేత వైఖరితో ఆ పార్టీ కేడర్ కూడా ఆందోళనకు గురవుతోంది.

నేటి నుంచి 'ఓపెన్ ఇంటర్' మూల్యాంకనం

అనంతపురం ఎడ్యుకేషన్: సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్) ఇంటర్ వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్) శుక్రవారం ప్రారంభం కానుంది. ఇందుకోసం అనంతపురం నగరంలోని కేఎస్‌ఆర్ ప్రభుత్వ బాలికల కళాశాలలో క్యాంపు ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు క్యాంపు కొనసాగుతుందని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ తెలిపారు.

ఎగ్జామినర్ల నియామకాల్లో నిబంధనలకు పాతర

మూల్యాంకనంలో ఎగ్జామినర్లే కీలకం. అలాంటి వీరి నియామకాల్లో విద్యాశాఖ అధికారులు నిబంధనలకు పాతరేశారు.తప్పనిసరిగా ఆయా సబ్జెక్టుల్లో కనీసం మూడేళ్ల బోధన అనుభవం ఉన్నవారిని ఎగ్జామినర్లుగా నియమించాల్సి ఉంది. అయితే అనుభవం లేనివారిని, సబ్జెక్టుతో సంబంధం లేకపోయినా తమకు అనుకూలమైన వారిని నియమించారని పలువురు ఉపాధ్యాయులు చెబుతున్నారు. ముఖ్యంగా కామర్స్ సబ్జెక్టుకు కొందరు స్కూల్ అసిస్టెంట్ హిందీ, ఇంగ్లిష్ టీచర్లను నియమించారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ విద్యార్హత ఉన్నవారిని తీసుకున్నామని అధికారులు చెబుతున్నా... హిందీ, ఇంగ్లిష్ టీచర్లు వారి సబ్జెక్టుల్లో కాకుండా కామర్స్‌లో మూడేళ్లు ఎక్కడ బోధించారనేది చెప్పాల్సి ఉంది. ఈ విషయంపై గోవిందనాయక్ మాట్లాడుతూ స్పాట్ ప్రారంభ సమయంలో మరోమారు పరిశీలించి ఎక్కడైనా అలా జరిగి ఉంటే వారిని తొలగించనున్నట్లు తెలిపారు.

ఉత్కంఠకు నేటితో తెర

- ఉదయం 11 గంటలకు ఇంటర్ ఫలితాల విడుదల
- తొలిసారి 23 రోజుల్లోనే ఫలితాలు
- ఒకేసారి ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలు ప్రకటించనున్న ఇంటర్ బోర్డు



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ వార్షిక పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, బంధువులు, కళాశాలల యాజమాన్యాల ఉత్కంఠకు శుక్రవారం తెర పడనుంది. ఇంటర్ బోర్డు చరిత్రలోనే తొలిసారి పరీక్షలు ముగిసిన కేవలం 23 రోజుల్లోనే ఫలితాలను విడుదల చేస్తోందని అధికారులు, కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు చెబుతున్నారు. ఇదొక రికార్డ్‌గా అభివర్ణిస్తున్నారు. మార్చి 1 నుంచి 20 వరకు ఇంటర్ పరీక్షలు జరిగాయి. శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలు ఒకేమారు విడుదల చేయనున్నట్లు ఇంటర్ విద్యామండలి ప్రకటించింది.

పరీక్షలు రాసిన 41,556 మంది విద్యార్థులు

జిల్లాలో 170 జూనియర్ కళాశాలల నుంచి రెగ్యులర్, ఒకేషనల్ వార్షిక పరీక్షలు 41,556 మంది రాశారు. వీరిలో 24,446 మంది మొదటి సంవత్సరం, 17,110 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉన్నారు. మొత్తం 70 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మార్చి 21న మూల్యాంకనం ప్రారంభం కాగా ఈనెల 4 నాటికి పూర్తయింది.

పకడ్బందీగా నిర్వహణ

ఇంటర్ వార్షిక పరీక్షలకు ఇంటర్ బోర్డు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ప్రతి గదిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, పరీక్షల నిర్వహణ విధానంపై పటిష్ట నిఘా ఉంచారు. తాడేపల్లిలోని బోర్డు కార్యాలయం నుంచి నేరుగా పర్యవేక్షించారు. టెక్నాలజీ సాయంతో పరీక్ష పత్రాలు లీక్ కాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ప్రశ్న పత్రాలకు మూడు స్థాయిల్లో 'క్యూఆర్' కోడ్‌ను జోడించి లీకేజీలకు అడ్డుకట్ట వేశారు.ఫీజు చెల్లింపు, నామినల్ రోల్స్ నమోదు నుంచి ఎగ్జామ్ సెంటర్ల వరకు అన్ని దశల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని బోర్డు వినియోగించింది. గతంలో ఇంటర్ పరీక్ష ఫీజు చలానా రూపంలో విద్యార్థులు చెల్లించేవారు. వాటిని పరిశీలించి మదింపు చేసేందుకు బోర్డుకు చాలా సమయం పట్టేది. ఈ ఏడాది ఆన్‌లైన్ విధానం తీసుకురావడంతో ఆ ఇబ్బందులన్నీ తొలగిపోయాయి. ఇక ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షకు కూడా ఈసారి సాంకేతికతను వినియోగించారు. ప్రాక్టికల్స్ పూర్తయిన వెంటనే అక్కడికక్కడే మార్కులను బోర్డు వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. మార్కుల విషయంలో ఎక్కడా పొరపాట్లు జరగకుండా ఎగ్జామినర్ రెండుసార్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకున్నారు.

ఎన్నికల ప్రక్రియకు భంగం కలిగిస్తే ఉపేక్షించొద్దు



గొందిరెడ్డిపల్లి పోలింగ్ కేంద్రంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్పీ అమిత్ బర్దర్

రాప్తాడు: ఎన్నికల ప్రక్రియకు భంగం కలిగించే వారిని ఉపేక్షించరాదని ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశించారు. గురువారం రాప్తాడు మండలంలో సమస్యాత్మక గ్రామాలైన ప్రసన్నాయపల్లి, గొందిరెడ్డిపల్లి గ్రామాల్లో ఎస్పీ పర్యటించారు. తాజా పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. నిష్పక్షపాత ఎన్నికలే లక్ష్యంగా పని చేద్దామన్నారు. 44వ జాతీయ రహదారిపై వాహన తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. సమస్యాత్మక గ్రామాల్లోని పరిస్థితులను ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని డీఎస్పీ, సీఐలకు సూచించారు. అల్లర్లు, గొడవలకు దూరంగా ఉండాలని ఆయా గ్రామాల ప్రజలకు సూచించారు. ప్రశాంత జీవనానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకట శివారెడ్డి, సీఐ మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలకు దూరంగా ఉండండి

ఆత్మకూరు: ఎన్నికల నేపథ్యంలో ఘర్షణలకు దూరంగా ఉండాలని ఎస్పీ అమిత్ బర్దర్ సూచించారు. రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి, పోలీసు సిబ్బందితో కలసి తోపుదుర్తి గ్రామంలో గురువారం రాత్రి ఆయన పర్యటించారు. ప్రజలతో సమావేశం నిర్వహించారు. ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. పల్లెల్లో ప్రశాంతంగా జీవించాలన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హనుమా.. మము గనుమా



అశేష భక్తజనం నడుమ సాగుతున్న రథోత్సవం (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

రాయదుర్గం: డి హీరేహాళ్ మండలంలోని మురడిలో గురువారం ఆంజనేయస్వామి బ్రహ్మరథోత్సవం కనులపండువగా జరిగింది. స్వామికి వివిధ అభిషేకాలు, పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవ విగ్రహాన్ని అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య పల్లకీలో ఊరేగింపుగా తీసుకొచ్చారు. పూలతో ప్రత్యేకంగా అలంకరించిన రథంలో అధిష్టింపజేశారు. ఈఓ నరసింహా రెడ్డి, గ్రామ పెద్దలు నారికేళాలు సమర్పించి ఉత్సవం ప్రారంభించారు. రథోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. 'హనుమా మము గనుమా' అంటూ దివ్య స్వరూపుడి దర్శనం చేసుకుని తరించారు. రథం ముందు యువకులు నందికోలు నాట్యం, కోలాటం, చెక్కభజనలతో ఆకట్టుకున్నారు. వైఎస్సార్‌సీపీ రాయదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి రథోత్సవంలో పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొని ఉపేంద్రారెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ బోజరాజ్‌నాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఖరీదైన సేవ.. ఇక ఉచితం

- పెద్దాస్పత్రిలో అందుబాటులోకి 'అఫేరిసిస్'
- ప్రైవేటుగా ఈ సేవ పొందాలంటే రూ.11 వేల నుంచి రూ.14 వేల ఖర్చు

అనంతపురం మెడికల్: వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం అత్యాధునిక సేవలు అందుబాటులోకి తీసుకొస్తోంది. పేదలకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందేలా చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే సర్వజనాస్పత్రిలో 'అఫేరిసిస్' పరికరాన్ని అందుబాటులోకి తెచ్చింది.

ఉపయోగమిదే...

డెంగీ, మలేరియా, హై బీపీ తదితర సమస్యలున్న వారిలో ఒక్కోసారి ప్లేట్‌లెట్స్ అమాంతంగా పడిపోతాయి. అలాంటి వారికి సాధారణ ప్లేట్ లెట్స్ నాలుగు యూనిట్లు ఎక్కిస్తే 40 వేల నుంచి 50 వేల ప్లేట్‌లెట్స్ పెరిగే అవకాశం ఉంటుంది. అదే సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ ఒక్క యూనిట్ ద్వారానే అదే స్థాయిలో ప్లేట్‌లెట్స్ పెంచవచ్చు. అయితే, అఫేరిసిస్ పరికరం ద్వారా ఈ సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ అందించాల్సి ఉంటుంది. గతంలో ఈ పరికరం లేక రోగులు ప్రైవేటుగా సేవలు పొందాల్సి వచ్చేది. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఇందుకు రూ.8 వేలు ఖర్చవుతుండగా, ప్రైవేటు బ్లడ్ బ్యాంకుల్లో అయితే రూ.15 వేల వరకూ సమర్పించుకోవాల్సి వచ్చేది. అయితే, పేదలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం.. పెద్దాస్పత్రిలో రూ.24 లక్షల విలువ చేసే అఫేరిసిస్ పరికరం అందుబాటులోకి తీసుకొచ్చింది. రోగులపై భారం పడకుండా సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ ఉచితంగా అందించనుంది. సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు సూచించారు.

నిఘా కట్టుదిట్టం

- చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు
- ఇప్పటి వరకూ రూ.2.35 కోట్ల నగదు సీజ్
- రూ.10.51 లక్షల విలువ చేసే మద్యం పట్టివేత
- ఆకస్మిక తనిఖీలు చేపడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. ప్రధానంగా నగదు, మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంతో పాటు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేసింది. ఈ క్రమంలో జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్ ఆకస్మిక తనిఖీలు చేపడుతూ చెక్‌పోస్టుల వద్ద అధికారులు, సిబ్బంది పనితీరును పరిశీలించడంతో పాటు తగిన ఆదేశాలు జారీ చేస్తున్నారు.

పెద్ద మొత్తంలో పట్టుబడ్డ నగదు

ఫ్లయింగ్ స్క్వాడ్ (ఎఫ్ఎస్), స్టాటిక్ సర్వైలెన్స్ (ఎస్ఎస్) బృందాలు చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా పెట్టాయి. అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఎలాంటి రసీదు లేకుండా తరలిస్తున్న నగదును సీజ్ చేస్తున్నారు. ఇప్పటి వరకూ రూ.2,35,64,810 నగదును సీజ్ చేశారు. ఇదే క్రమంలో ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టం (ఈఎస్ఎంఎస్) ద్వారా ఇప్పటి వరకూ రూ.10,51,901 విలువ చేసే 7,268.61 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు.

కోడ్ అమలు పటిష్టంగా

జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండెక్ట్–ఎంసీసీ) పటిష్టంగా అమలు చేస్తున్నారు. ఇప్పటి వరకూ 7,322 పోస్టర్లు, 3,204 బ్యానర్లు తొలగించారు. అలాగే 846 గోడలపై ఉన్న వివిధ పార్టీల రాతలను తొలగించారు.

ఫిర్యాదులు పరిష్కారం వేగవంతం

ఎన్నికల కమిషన్ రూపొందించిన సి–విజిల్ యాప్ ద్వారా ఇప్పటి వరకూ 340 ఫిర్యాదులు అందాయి. జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్‌కు 154 ఫిర్యాదులు అందాయి. ఇందులో రాయదుర్గం నియోజకవర్గం నుంచి 9, ఉరవకొండ నుంచి 22, గుంతకల్లు నుంచి 27, తాడిపత్రి నుంచి 35, శింగనమల నుంచి 3, అనంతపురం నుంచి 32, కళ్యాణదుర్గం నుంచి 38, రాప్తాడు నియోజకవర్గం నుంచి 20 ఫిర్యాదులున్నాయి. వీటిపై తక్షణమే విచారణ చేపట్టి ఎన్నికల కమిషన్ నిర్దేశించిన 100 నిమిషాల్లోనే పరిష్కరించారు.

కోడ్ ఉల్లంఘనులపై చర్యలు

ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుంటున్నారు. ఈ క్రమంలో ఇప్పటి వరకూ 60 మంది వలంటీర్లు, 10 మంది చౌక దుకాణపు డీలర్లు, ఎండీయూ నిర్వాహకులు, 19 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఇద్దరు శాశ్వత ఉద్యోగులను సస్పెండ్ చేశారు.



తాడిపత్రి సమీపంలోని కడప రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద చేపట్టిన తనిఖీలను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్ (ఫైల్)

దళిత యువతిపై లైంగిక దాడి

పామిడి: మండలంలోని కండ్లపల్లిలో ఓ దళిత యువతిపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి లైంగికదాడికి పాల్పడ్డాడు. గురువారం రాత్రి ఒంటరిగా బహిర్భూమికి వెళ్లిన యువతిని అదే గ్రామానికి చెందిన వన్నూరప్ప అలియాస్ కళ్యాణ్ వెంబడించి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ రాజశేఖరరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. బాధితురాలిని అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు.

మామిడి, చీనీ చెట్లు దగ్ధం

గార్లదిన్నె: మంటలు చెలరేగి గార్లదిన్నె మండలంలోని కల్లూరు శివారులోని మామిడి, చీనీ తోటలతో పాటు మొక్కజొన్న పంట కాలిబూడదయ్యాయి. బాధిత రైతు జమ్మన్న తెలిపిన మేరకు... తమకున్న ఆరు ఎకరాల్లో మొక్కజొన్నతో పాటు మామిడి, చీనీ తోటల పెంపకాన్ని చేపట్టాడు. ప్రస్తుతం చీనీ, మామిడి, మొక్కజొన్న పంట కోతదశలో ఉంది. గురువారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో కంచెకు వ్యాపించిన మంటలు తొలుత మొక్క జొన్న పంటను చుట్టుముట్టాయి. అనంతరం ఆ పక్కనే ఉన్న 100 చీనీ, 20 మామిడి చెట్లకు వ్యాపించడంతో కాలిబూడిదయ్యాయి. పంటతో పాటు, డ్రిప్ పరికరాలు, పైపులు దగ్ధమయ్యాయి. దాదాపు రూ.15 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.

క్లుప్తంగా

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

గుత్తి రూరల్: బైక్‌ను ఢీకొని ఇద్దరి మృతికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకట్రామిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గుత్తి మండలం ఎంగిలిబండ శివారులో 67వ జాతీయ రహదారిపై ఈ నెల 10న చోటు చేసుకున్న ప్రమాదం తెలిసిందే. తాడిపత్రి వైపు నుంచి వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో తాడిపత్రి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన అన్నదమ్ములు చంద్రశేఖర్‌రెడ్డి(26), శివానందరెడ్డి(24) అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల తండ్రి రామసుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు కారును నిర్లక్ష్యంగా, అతి వేగంగా నడిపి ఇద్దరి మృతికి కారణమైన డ్రైవర్‌పై ప్రస్తుతం సెక్షన్ 304–ఏ కింద కేసు నమోదు చేశారు. అయితే ప్రమాద సమయంలో కారు నడిపిన వారు ఎవరనేది విచారణ చేసి, వారిపై పూర్తి స్థాయిలో కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

సీఎం జగన్‌తోనే వడ్డెర్లకు గుర్తింపు

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు మేలు చేసింది జగనన్నే
- 99 శాతం వడ్డెర కుటుంబాలు వైఎస్సార్‌సీపీ వెంటే
- వడ్డెర ఆత్మీయసభలో ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి (చిత్రంలో) ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, పార్టీ పరిశీలకుడు ఎంఆర్‌సీ రెడ్డి

రాయదుర్గం: గడిచిన ఏడున్నర దశాబ్దాల తర్వాత వడ్డెర్లకు చట్ట సభల్లో మాట్లాడే అవకాశం కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి... వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని రాయదుర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి అన్నారు. రాయదుర్గంలోని సీతారామ కల్యాణమంటపంలో గురువారం నిర్వహించిన వడ్డెర్ల ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, పార్టీ పరిశీలకులు ఎంఆర్‌సీ రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డితో కలసి ఆయన హాజరయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మెట్టు గోవిందరెడ్డి మాట్లాడారు.. వడ్డెర్లకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించి రాజకీయంగా చైతన్యం తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. ఈ నేపథ్యంలో 99 శాతం వడ్డెర కుటుంబాలన్నీ వైఎస్సార్‌సీపీ వెంటే నడుస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సంక్షేమం నుంచి రాజ్యాధికారం వరకూ సమాన హక్కులు దక్కాయంటే సీఎం వైఎస్ జగన్ చలువేనన్నారు. ఎన్నికల్లో ప్రతి ఓటు ఫ్యాన్ గుర్తుపై వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. వడ్డెర్లు కోరుకున్నట్టే ప్రమాద బీమా రూ.25 లక్షలు పెంచేలా సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళతామన్నారు. వలసలు తగ్గించి స్థానికంగానే ఉపాధి కల్పించేలా కృషి చేస్తామన్నారు.

బడుగుల ద్రోహి చంద్రబాబు

బడుగు, బలహీన వర్గాల ద్రోహి నారా చంద్రబాబు అని మెట్టు ధ్వజమెత్తారు. 2014 ఎన్నికల్లో వడ్డెర సొసైటీలకు లీజుపై క్వారీల అప్పగింత, వ్యాట్ పన్ను మినహాయింపు, సబ్సిడీపై క్రషర్లు, జేసీబీలు అందిస్తామని మేనిఫెస్టోలో ప్రకటించి, గెలిచిన తర్వాత నెరవేర్చకుండా మోసం చేశారని గుర్తు చేశారు. మళ్లీ ఎన్నికలు దగ్గర పడడంతో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు కుల రాజకీయాలకు తెరలేపారన్నారు. మంచి చేసే ప్రభుత్వం, మేలు కోరే నాయకుడి వెంటే అంతా నడవాలని విజ్ఞప్తిచేశారు.

కుప్పంలోనూ ఓటమి తప్పదు

ఎన్నికల్లో నారా చంద్రబాబుకు ఘోర పరాజయం తప్పదని, కుప్పంలోనూ ఆయన ఓటమి ఖాయమని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, పరిశీలకులు ఎంఆర్‌సీరెడ్డి, గౌని, శిల్ప అన్నారు. ఎన్ని జెండాలు జతకట్టినా రాష్ట్రంలో 175 కు 175 అసెంబ్లీ, 25 కు 25 పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం ఖాయమన్నారు. ప్రజలంతా వైఎస్ జగన్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. అమ్మఒడి, ఆసరా, చేయూత, చేదోడు, రైతు భరోసా లాంటి అనేక పథకాలు కావాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగనే ఉండాలని అందరూ ఆకాంక్షిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్నీ గ్రామాలకు చెందిన వడ్డే సంఘం నాయకులు, కులస్తులు, వడ్డె ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ అరవ శివప్ప, బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి సిద్దప్ప, జిల్లా కార్యదర్శి మాధవరెడ్డి, నాయకులు పొరాళ్ల శివ, గౌని కాంతారెడ్డి, తాళ్లకెర వీరభద్రారెడ్డి, ఎరగుంట కేశవరెడ్డి, గరుడచేడు రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



హాజరైన వడ్డెర కులస్తులు

పూలే ఆశయాలు కొనసాగిస్తాం



మహాత్మ జ్యోతిరావ్‌పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, తదితరులు

- వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకరనారాయణ
- వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా పూలే జయంతి

అనంతపురం కార్పొరేషన్: బడుగుల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావ్ పూలే ఆశయాలను కొనసాగిస్తామని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి ఎం.శంకరనారాయణ అన్నారు. పూలే అడుగుజాడల్లో సీఎం వైఎస్ జగన్ నడుస్తూ బడుగుల అభ్యున్నతికి బాటలు వేస్తున్నారన్నారు. ఆ స్ఫూర్తిని తామంతా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం జ్యోతిరావ్‌పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకరనారాయణ మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ తదితర అన్ని వర్గాల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడ్డాయన్నారు. ఖరీదైన వైద్యాన్ని, విద్యను పేదలకు చేరువైందన్నారు. నవరత్నాల్లో భాగంగా రూ.2.55 లక్షల కోట్లు విడుదల చేస్తే ఇందులో రూ.1.26 లక్షల కోట్ల లబ్ధి బీసీలకే అందిందని గుర్తు చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌తోనే బడుగులకు రాజ్యాధికారం సాధ్యపడిందన్నారు. పూలే ఆశయాలను సాకారం చేసిన సీఎం వైఎస్ జగన్‌కు అందరూ మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతపురం, హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గాల డిప్యూటీ రీజనల్ కో–ఆర్డినేటర్ రాగే పరుశురాం మాట్లాడుతూ... 2014 ఎన్నికలకు ముందు బీసీ డిక్లరేషన్ పేరుతో వందకుపైగా హామీలను ఇచ్చిన చంద్రబాబు... అధికారం చేపట్టిన తర్వాత ఏ ఒక్కటీ నెరవేర్చకుండా మోసం చేశారని మండిపడ్డారు. పూలే ఆశయసాధన ఒక్క సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమవుతుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ... గతంలో ఎన్నడూ లేని విధంగా బడుగులకు రాజ్యాధికారం కల్పించి, మంత్రివర్గంలో 11 మందికి చోటు కల్పించిన సీఎం వైఎస్ జగన్ ఔనత్యాన్ని కొనియాడారు. ఎమ్మెల్సీ మంగమ్మ, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ ఎం.మంజుల, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వత్థ నాయక్, అగ్రి అడ్వైజరీ కమిటీ చైర్మన్ వెన్నపూస రామచంద్రారెడ్డి, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, డీసీసీబీ మాజీ చైర్మన్ పామిడి వీరా, కార్పొరేటర్ శ్రీనివాసులు, పార్టీ జోనల్ ఇన్‌చార్జ్‌లు రాజారాం, రిలాక్స్ నాగరాజు, మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు రాధ, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, డైరెక్టర్ శ్రీనివాసులు, నాయకులు అనిల్‌కుమార్‌గౌడ్, ఓబులేసు, ధనుంజయయాదవ్ పాల్గొన్నారు.

రాగే పరుశురాంకు సన్మానం

అనంతపురం, హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గాల డిప్యూటీ రీజినల్ కో ఆర్డినేటర్‌గా బాధ్యతలు తీసుకున్న రాగే పరుశురాంను ఎమ్మెల్సీ మంగమ్మ, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ , పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌కు రాగే పరుశురాం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



సన్మానం అందుకుంటున్న రాగే పరుశురాం

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

- రూ.15 లక్షల విలువ చేసే 30 వాహనాలు స్వాధీనం
- పట్టుబడిన అన్నమయ్య జిల్లా వాసి
- ఉమ్మడి అనంత, వైఎస్సార్ జిల్లాల్లో పలు కేసులు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కదిరి టౌన్: ద్విచక్ర వాహనాల దొంగను అరెస్ట్ చేసి రూ.15 లక్షల విలువ చేసే 30 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు కదిరి సీఐ పుల్లయ్య తెలిపారు. వివరాలను గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. గత రెండు నెలలుగా కదిరి పట్టణంలో వరుసగా ద్విచక్ర వాహనాల చోరీలు జరిగాయి. వీటిపై కేసు నమోదు చేసిన పోలీసులు కదిరి డీఎస్పీ శ్రీలత నేతృత్వంలో సీఐ పుల్లయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా విడిపోయి దర్యాప్తు వేగవంతం చేశారు. గురువారం కదిరి – రాయచోటి మార్గంలో వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం తూముకుంట గ్రామానికి చెందిన మామిళ్ల వీరారెడ్డిని ఆపి రికార్డుల కోసం ఆరా తీశారు. ఆ సమయంలో ఆయన తడబడడంతో అనుమానం వచ్చి అదుపులోకి తమదైన శైలిలో విచారణ చేయడంతో ద్విచక్ర వాహనాల చోరీల అంశం వెలుగులోకి వచ్చింది. వ్యసనాలకు బానిసగా మారాడు. తన జల్సాలు తీర్చుకునేందుకు అవసరమైన డబ్బు కోసం ద్విచక్ర వాహనాలు అపహరించుకెళ్లి తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. 30 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కదిరి టౌన్, కదిరి రూరల్, గాండ్లపెంట, అనంతపురం, తాడిపత్రి, రాయచోటిలో 19 కేసులు ఉన్నట్లుగా గుర్తించారు. గాండ్లపెంటలో 2, రాయచోటి 2, కదిరిలో 26 వాహనాలు అపహరించినట్లుగా విచారణలో తేలింది. నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన సిబ్బందిని ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీలత అభినందించారు.

పండుగ పూట విషాదం



మృతుడు లాల్‌బాషా

కణేకల్లు: రంజాన్ పండుగ ఓ ముస్లిం కుటుంబంలో తీరని విషాదాన్ని మిగిల్చింది. గ్రామంలోని అందరూ రంజాన్ పండుగ జరుపుకుంటున్న వేళ నమాజ్ కోసం మసీదుకు వెళ్లిన ఓ వ్యక్తిని కరెంటు షాక్ రూపంలో మృత్యువు కబళించింది. ఈ విషాద ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలు... కణేకల్లు మండలం సొల్లాపురం గ్రామానికి చెందిన డి.లాల్ బాషా (32)కు నాలుగేళ్ల క్రితం అనంతపురానికి చెందిన వన్నూర్‌బీతో వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న లాల్‌బాషా... రంజాన్ మాసం ఆరంభం నుంచి తన విధులకు సెలవు పెట్టి ఉపవాసాలుంటూ ఐదుపూటల నమాజ్‌లో పాల్గొంటూ వచ్చారు. గురువారం పండుగ కావడంతో ఇంట్లో అందరితో కలసి సంతోషంగా గడిపారు. సాయంత్రం ప్రార్థనకు మసీదు వెళ్లిన లాల్ బాషా వజూ (కాళ్లు, చేతులు శుభ్రం) చేసుకునేందుకు కొళాయి వద్దకెళ్లాడు. అప్పటికే తెగిపడిన విద్యుత్ సర్వీస్ వైరును గమనించకుండా తొక్కడంతో షాక్‌కు గురయ్యాడు. గమనించిన స్నేహితుడు బాషా వెంటనే అతన్ని పక్కకు లాగాడు. ఆ సమయంలో బాషా కూడా షాక్‌కు గురైనా త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న లాల్‌బాషాను స్థానికులు వెంటనే ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న వెంటనే గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రూ.2.99 లక్షల నగదు స్వాధీనం

రాప్తాడు రూరల్: ఎన్నికల నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున ధర్మవరం పంగల్ రోడ్డులో ఇటుకలపల్లి సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ రాఘవేంద్రరెడ్డి వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన కోళ్ల తరలించే వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.2.99 లక్షలు తరలిస్తూ అనంతపురం నగర శివారులోని బీజేపీ కొట్టాలకు చెందిన పురుషోత్తం పట్టుబడ్డాడు. అయితే చికెన్ సెంటర్ల నుంచి కలెక్షన్లు తీసుకుని వస్తున్నట్లుగా పురుషోత్తం వివరణ ఇచ్చాడు. దీనిపై విచారణ చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.

విష పురుగు కుట్టి వృద్ధురాలి మృతి



లక్షుమమ్మ (ఫైల్)

యాడికి: విష పురుగు కుట్టడంతో యాడికి మండలం గుడిపాడుకు చెందిన దండు లక్షుమమ్మ (73) మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... లక్షుమమ్మకు ఇద్దరు కుమారులు ఉన్నారు. బుధవారం రాత్రి భోజనం ముగించుకుని ఇంటి ఆవరణలో పడుకున్న ఆమె... గురువారం తెల్లవారు జామున తనను ఏదో కుట్టినట్లుగా గుర్తించింది. అయినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉండిపోయింది. ఉదయం నిద్ర లేచిన తర్వాత తల బరువుగా ఉంటూ కళ్లు కనపించకపోవడంతో విషయాన్ని కుమారులకు తెలిపింది. దీంతో పెద్ద కుమారుడు శ్రీరాములు వెంటనే ఆమెను తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి పిలుచుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు విషపురుగు కుట్టడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారిందని గుర్తించి అనంతపురానికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం ఆమె మృతి చెందింది. ఘటనపై రెండో కుమారుడు కంబగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

ఘనంగా లంకాదహనం



ఆంజనేయస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

కసాపురంలో ముగిసిన ఉగాది ఉత్సవాలు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో 3 రోజులుగా సాగుతున్న ఉగాది ఉత్సవాలు గురువారం లంకాదహనం కార్యక్రమంతో ఘనంగా ముగిశాయి. లంకాదహనం వేడుకను వీక్షించడానికి ప్రజలు భారీగా తరలివచ్చారు. ముందుగా ఆంజనేయస్వామిని ఒంటె వాహనంపై కొలువుదీర్చి కాశీవిశ్వేశ్వరాలయం వరకూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ ఈఓ భద్రాజీ ఆధ్వర్యంలో కాశీవిశ్వేశ్వరుడితో ఆంజనేయస్వామికి పూజలు చేశారు. వేదగోష్టి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి చేతుల మీదుగా లంకా దహనం వేడుక ప్రారంభించారు. అయ్యప్ప క్రాకర్స్ వారు అందించిన టపాసులతో దాదాపు రెండు గంటలపాటు లంకా దహనం సాగింది.



లంకాదహనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఈఓ భద్రాజీ, సిబ్బంది

క్లుప్తంగా

26 వరకూ శ్రీరామనవమి ఉత్సవాలు



శ్రీరామనవమి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎండోమెంటు అధికారులు, పాలక మండలి సభ్యులు

అనంతపురం కల్చరల్: ఈనెల 17 నుంచి 26 వరకూ భద్రాచలాన్ని తలపిస్తూ అనంత వేదికగా పది రోజుల పాటు శ్రీరామనవమి ఉత్సవాలు వేడుకగా జరుగనున్నాయి. గురువారం స్థానిక మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అనువంశీకులు రామసుబ్రహ్మణ్యంతో పాటూ ధర్మకర్తల మండలి సభ్యులు నీలూరి సురేష్, సుబ్రహ్మణ్యం, తిమ్మారెడ్డి, వెంకటస్వామి, ప్రధాన అర్చకులు నరసింహశాస్త్రి, కిషోర్ తదితరులు ఉత్సవ వివరాలను తెలియజేశారు. నగర వీధుల్లో రోజూ సీతారాములు వివిధ వాహన సేవలతో ఊరేగింపుగా వెళ్లి భక్తులకు దర్శనమిస్తారు. ఈనెల 22న ముత్యాల తలంబ్రాలతో సీతారాముల కల్యాణం, 24న శ్రీరాముడి పట్టాభిషేకం జరుగుతాయి. భక్తులందరూ ఉత్సవాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఎండోమెంటు సిబ్బంది కోరారు. అంతకుముందు రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు తపోవనంలో 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: నారాయణపురం పంచాయతీలోని తపోవనంలో శుక్రవారం ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు తపోవనం సర్కిల్ నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతపురం టౌన్: నగరంలోని రుద్రంపేట ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీ లక్ష్మీనారాయణ తెలిపారు. దీంతో రుద్రంపేట, చంద్రబాబుకొట్టాల, విశ్వశాంతినగర్, పీవీకేకే కాలేజ్, సైపుల్లాకాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని ఆయా ప్రాంతాల ప్రజలు గమనించాలని కోరారు.

శ్రీరామనవమి వేడుకలు ప్రారంభం



కోదండ రామస్వామి అలంకరణలో కొలువుదీరిన సీతారాములు

తాడిపత్రి అర్బన్: పట్టణంలో శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏటా ఉగాది పండుగ రెండు రోజుల తరువాత నవమి ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. ఆర్విస్వామి కల్యాణమండపం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో గురువారం రాత్రి శ్రీరామచంద్రుడు కోదండరామస్వామి అలంకారంలో కొలువుతీరాడు. ఈ సందర్భంగా సీతారాములను ప్రత్యేకంగా అలంకరించారు. ఆర్యవైశ్యులు పెద్దఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. భద్రచలంలో సీతారాముల కల్యాణోత్సవం రోజు ఇక్కడ కూడా స్వామికి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు.

వ్యభిచారం గుట్టురట్టు

అనంతపురం: అశోక్‌నగర్‌లో ఓ అద్దె ఇంట్లో వ్యభిచారం దందా బయటపడింది. అనంతపురం వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అశోక్‌నగర్‌లోని ఓ ఇంటికి ఎక్కువ మంది వచ్చి వెళుతున్నట్లు స్థానిక ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో గురువారం పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఇందులో వ్యభిచార నిర్వాహకురాలితో పాటు ఒక విటుడిని అరెస్ట్ చేశారు. ముగ్గురు యువతులకు విముక్తి కల్పించారు. సులువుగా డబ్బు సంపాదించేందుకు అలవాటుపడిన ఇతర ప్రాంతాల యువతులు, మహిళలను ఈ రొంపిలోకి లాగుతున్నట్లు సమాచారం. వారితో విటులను ఆకర్షించేందుకు వాట్సాప్, పలు సోషల్ మీడియాలో వలపు వల వేసినట్లు తెలిసింది. 20 నుంచి 35 ఏళ్లలోపు యువతులతో వ్యభిచారం సాగిస్తున్నట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. ఎస్కేయూ నుంచి కందుకూరుకు వెళ్లే దారిలో ఆరుబయట పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఇటుకలపల్లి పోలీసులు దాడి చేశారు. ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.18,400 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ఈద్-ఉల్-ఫితర్ సందడి



చిన్నారుల ఆత్మీయ ఆలింగనం



ఆత్మకూరు: సర్దార్‌వలి దర్గాలో ప్రార్థనలు



అనంతపురంలో ఈద్గా మైదానానికి వెళ్తున్న దృశ్యం



అనంతపురంలో నమాజ్ చేస్తున్న ముస్లింలు



ఈద్గా మైదానానికి వెళ్తున్న చిన్నారులు



ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, మేయర్ వసీం



మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న యువత

అనంతపురం కల్చరల్/రాప్తాడు/కనగానపల్లి/ఆత్మకూరు: స్వార్థ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా తోచినంత సాయం అందించే వాడే ముస్లిం అని పలువురు మతపెద్దలు తెలిపారు. గురువారం అనంతపురం, రాప్తాడు, కనగానపల్లి, ఆత్మకూరులో రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) సందడి నెలకొంది. రాప్తాడులోని 44వ జాతీయ రహదారిపై ఉన్న ఈద్గా మైదానంలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేపట్టారు. ప్రతి ముస్లిం తమ జీవితంలో ఖురాన్ బోధించిన పంచ సూత్రాలను పాటించాలని మత పెద్ద మౌలానా నమాన్ సూచించారు. పేద, ధనిక భేదం లేకుండా ముస్లింలంతా కలిసిమెలసి పండుగ జరుపుకోవాలన్నారు. పండగ చేసుకునే స్థోమత లేని నిరుపేదలకు చేయూత అందించాలని తెలిపారు. దాన ధర్మాలకు ఆత్మీయ పండుగ ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్) అని వివరించారు. ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. తోటి మిత్రులు, బంధువులను ఇళ్లకు ఆహ్వానించి విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఆత్మకూరులోని సర్దార్‌వలి దర్గా వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. చక్కెర చదివింపులు చేయించి, పేదలకు దానం చేశారు. అనంతరం ఈద్గా మైదానంలో హజరత్ షబ్బీర్ సాబ్ పండుగ ప్రాధాన్యత వివరించారు. ఇక కనగానపల్లి మండలంలోని మామిళ్లపల్లి, తగరకుంట, తూంచర్ల, నరసంపల్లి, కుర్లపల్లి గ్రామాల్లోని మసీదుల్లో సామూహిక ప్రార్థనలు జరిగాయి. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ మహ్మద్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, ఎంపీ అభ్యర్థి మాజీ మంత్రి శంకరనారాయణ, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్ తదితరులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లింలకు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేశారు.



ఆత్మకూరు: దువా చదువుతున్న దృశ్యం



రాప్తాడులో ప్రత్యేక ప్రార్థనలు



రాప్తాడు: రంజాన్ విశిష్టతను తెలియజేస్తున్న మౌలానా

17 నుంచి సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న ఈఓ, ఆలయ చైర్మన్, కమిటీ సభ్యులు

కూడేరు: దక్షిణ భారత దేశంలోని శివాలయాల్లో ఒక్కటిగా ఖ్యాతిగాంచిన కూడేరు శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 17 నుంచి జరగనున్నట్లు ఆలయ ఈఓ రమేష్‌బాబు, ధర్మకర్త రామదుర్గం కిష్టప్ప తెలిపారు. గురువారం సంగమేశ్వరిడి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆలయంలో వారు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి 25 వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయన్నారు. 23న ఉదయం 10:45 నిమిషాలకు మడుగు తేరు, సాయంత్రం 5:30 గంటలకు రథోత్సవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శంకర్ రెడ్డి, పద్మావతి, అలివేలమ్మ, లీలావతి, ప్రతిభా భారతి, శ్రీనివాసులు, పురోహితులు శివశంకర్ శాస్త్రి, మహేష్, ప్రవీణ్ స్వాములు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి 'సింగం'

అనంతపురం టవర్‌క్లాక్: త్వరలో వైఎస్సార్‌సీపీలో చేరనున్నట్లు బీజేపీ నేత సింగం సదాశివారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడు అధికారం కోసం బీజేపీ, జనసేన పార్టీని 90 రోజుల లీజుకు తీసుకున్నారని ఎద్దేవా చేశారు. పొత్తుల్లో భాగంగా స్థానికేతరులకు సీట్లు కట్టబెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ విధానాలు నచ్చక ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరనున్నట్లు ప్రకటించారు.

17న సీతారాముల కల్యాణం

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు ఆర్‌ఎస్ అగ్రహారం సీతారామాంజనేయస్వామి ఆల యంలో ఈ నెల 17న సీతారాముల కళ్యాణం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. ఆలయంలో మంగళవారం నుంచి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. అలాగే శ్రీరామనవమి సందర్భంగా బుధవారం ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణోత్సవం ఉంటుందన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. రాత్రి 11 గంటల నుంచి భజన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రాత్రికి కీలుగుర్రాలు, చెక్కభజనతో స్వామి ఉత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు.

నేడు వాహనాల వేలం

గుత్తి: పట్టణంలోని సెబ్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం వాహనాల వేలం నిర్వహించనున్నట్లు సీఐ శివ సాగర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేస్తామన్నారు. ఆసక్తి గల వారు రూ.3,000 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

వైభవంగా అక్కమాంబ జాతర



ప్రత్యేక అలంకరణలో అక్కమాంబ

కంబదూరు: ఉగాది ఉత్సవాల్లో భాగంగా అమ్మమాంబ జాతర గురువారం వైభవంగా జరిగింది. స్థానిక చెరువు కట్ట వద్ద ఉన్న అక్కమాంబ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. అంతకు ముందు మాజీ ఎంపీటీసీ వడ్డే వెంకటప్ప కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి, అమ్మవారికి సమర్పించారు. జాతరకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచికూడా పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి



కనుమ్ముకల సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



వృద్ధురాలిని ఓటు అడుగుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

- 25 ఏళ్లుగా పరిటాల కుటుంబం చేసిందేమీ లేదు
- ప్రజా సంక్షేమమే మా అభిమతం
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండంలోని చిన్నపురెడ్డిపల్లి, కనుముక్కల, ఓబుళంపల్లి, ఆమిదాలకుంట, నాగిశెట్టిపల్లి, గంగినేపల్లి, గంగినేపల్లి తండా, ఎర్రోనిపల్లి, ఎర్రోనిపల్లి తండాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించారు. సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టాలని కోరారు. జగనన్న ఏదైనా చెప్తే అందులో నిజం ఉంటుందన్నారు. చంద్రబాబు ఏది చెప్పినా అబద్ధం మోసం ఉంటాయని తెలిపారు. సీఎం జగనన్న వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. దేశానికే ఆదర్శంగా పాలన సాగించారని కొనియాడారు. 2019 ఎన్నికల్లో తనను 25 వేల మెజార్టీతో గెలిపించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పేరూరు డ్యాంకు నీరందించామన్నారు. రైతుల పొలాల్లో ఉచితంగా బోర్లు వేశామని పేర్కొన్నారు.

3 వేల మందికి ఉపాధి కల్పిస్తాం

రామగిరి మండలంలోని బంగారు గనులను తెరిపించేందుకు కృషి చేశామని తెలిపారు. ఇవి తిరిగి తెరిస్తే 3 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. జగనన్న పాలనలో అక్కచెల్లెమ్మలు, అవ్వతాతల ముఖాల్లో చిరునవ్వు చూశామన్నారు. ప్రభుత్వ బడులను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, బూట్లు, టై, బ్యాగు తదితర వస్తువులు అందజేసినట్లు తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు ప్రవేశపెట్టి గ్రామాల్లో వైద్య సేవలు అందించామన్నారు. టీడీపీ మళ్లీ మోసం చేసేందుకు వస్తోందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. 25 ఏళ్ల అధికారంలో ఉండి ప్రజలకు మంచి చేయని వారు ఇప్పుడు అమాయకులను అడ్డుపెట్టుకుని చిచ్చుపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఓడిపోయిన వెంటనే ప్రజలను విస్మరించిన పరిటాల కుటుంబం హైదరాబాద్ చేరిందన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లిలోని పలు గ్రామాలకు తాగునీటిని అందించే పనులు చేపట్టామన్నారు. రూ.20 కోట్లతో అమ్మ డైయిరీ ఏర్పాటు చేసి మహిళా రైతులకు అప్పగించామన్నారు. మరోమారు అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో సానే రాజారెడ్డి, గంగుల భానుమతి, సానే నరసింహారెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీ: ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో గురువారం ఆటో-బైక్ ఢీ కొని సంగప్ప అనే వ్యక్తి గాయపడ్డాడు. తాడిపత్రి రోడ్డు కాలనీలో నివాసముండే సంగప్ప బైక్‌లో గాంధీ సర్కిల్ వైపు వెళుతుండగా ఎదురుగా ఆటో ఢీకొంది. గాయపడిన సంగప్పను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మైక్రోస్కోప్ తరలింపుపై వాగ్వాదం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో మైక్రోస్కోప్ పరికరం తీసుకెళ్లే విషయమై వైద్యుడు, సిబ్బంది మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సైదన్న గురువారం కంటి ఆపరేషన్ థియేటర్‌లో ఉన్న ఓ మైక్రోస్కోప్‌ను మొబైల్ యూనిట్‌కు తరలించాలని చూశారు. అదే సమయంలో విధుల్లో ఉన్న సిబ్బంది ప్రభుత్వ సర్వజనాస్పత్రికి సంబంధించి పరికరాన్ని తీసుకెళ్లడం ద్వారా భవిష్యత్తులో ఏమైనా జరిగినా తాము కొనుగోలు చేసి ఇవ్వాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో డాక్టర్ సైదన్న ఆగ్రహంతో ఊగిపోయాడు. తనకు మైక్రోస్కోప్ ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో కాసేపు వైద్యుడు, సిబ్బంది మధ్య వాగ్వాదం జరిగింది. ఈ విషయాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ఇన్‌చార్జ్ ఆర్ఎంఓ డాక్టర్ శివకుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వారు డాక్టర్ సైదన్నను సూపరింటెండెంట్ చాంబర్‌కు పిలిపించి సముదాయించారు. డీఎంఈ పరిధిలో ఉన్న పరికరాలను తీసుకెళ్లకూడదని సూచించారు. రోగుల అవసరాల దృష్ట్యా భవిష్యత్తులో పరిశీలిస్తామని డాక్టర్ సైదన్నకు సర్ది చెప్పారు.

ఆదర్శప్రాయుడు జ్యోతిరావు పూలే



ఎస్కేయూలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వీసీ ప్రొఫెసర్ కే.హుస్సేన్ రెడ్డి



జేఎన్‌టీయూలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాస రావు



జెడ్పీ ఆవరణలో నినాదాలు చేస్తున్న బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు

అనంతపురం: జనహితమే అభిమతంగా సమాజ అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుల్లో మహాత్మా జ్యోతిరావు పూలే అగ్రగణ్యుడని ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ కే.హుస్సేన్ రెడ్డి అన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పూలే భవనంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. పూలే లాంటి మహానుభావులు బడుగువర్గాల అభ్యున్నతికి పోరాటం సాగించారన్నారు. స్త్రీ విద్యా వ్యాప్తికి పూలే చేసిన కృషి వెలకట్టలేనిదన్నారు. పూలే మనోధైర్యాన్ని దెబ్బతీయడానికి నాటి సామ్రాజ్యవాదులు విఫలయత్నం చేశారన్నారు. పూలేను ఆదర్శంగా తీసుకుని సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని సూచించారు. జ్యోతిరావు పూలే ప్రచురించిన అనేక రచనలపై రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య ప్రసంగించారు. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ.కృష్ణకుమారి మాట్లాడుతూ.. పూలే మహిళల విద్యాభివృద్ధికి శ్రమించారన్నారు. అతని జీవిత చరిత్ర నేటి యువతకు ఆదర్శమన్నారు. కన్వీనర్ డాక్టర్ సీహెచ్ కృష్ణుడు మాట్లాడుతూ.. జ్యోతిరావు పూలే అగ్రవర్ణ కులాలకు ఎవరూ లోబడి ఉండని కొత్త సామాజిక వ్యవస్థను సృష్టించాలని పిలుపునిచ్చారని పేర్కొన్నారు. న్యాయశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. శ్రీరాములు పాల్గొన్నారు. బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు ఎంఏ లక్ష్మణ రావు ఆధ్వర్యంలో ఎస్కేయూ ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వీసీ ప్రొఫెసర్ కే.హుస్సేన్ రెడ్డి ప్రారంభించారు.

జేఎన్‌టీయూలో..

జేఎన్‌టీయూ అనంతపురంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను పాలక భవనంలో నిర్వహించారు. వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాస రావు, రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్, పాలకమండలి సభ్యుడు డాక్టర్ ఎం. రామశేఖర్ రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ తదితరులు పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో మహాత్మా జ్యోతి రావు పూలే విగ్రహానికి బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతా చంద్రమోహన్, ఉద్యోగుల సంఘం నాయకులు మోతీలాల్, అనంత సేన, శివరుద్రప్ప, మహేష్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ కార్యాలయంలో..

జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రామకృష్ణ, నారాయణ స్వామి, లాలెప్ప, తప్పెట ఓబులేసు, గోవింద్, నాగరాజు, మల్లికార్జున, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.